క్లుప్తంగా

పందుల తరలింపు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపల్ ఆధ్వర్యంలో మంగళవారం పందులను పట్టి తరలించినట్లు మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. పందుల బెడద తీవ్రంగా పెరిగిందని పట్టణవాసులు ఫిర్యాదు చేయడంతో పందుల పెంపకం దారులను పిలిపించి పందులను పట్టుకుని తరలించిటనట్లు వివరించారు. కాలనీలలో ఏవైనా సమస్యలుంటే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలకు సూచించారు.

రామారెడ్డి 'మామ' మృతి



రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి గ్రామ ప్రజలు మామగానే పిలుచుకునే కూకుట్ల బాల్‌నర్సయ్య(65) సోమవారం కామారెడ్డిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో గుండెపోటుతో మృతి చెందారు. గ్రామ ప్రజలు ఎవరైనా సమస్యలు చెబితే వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పరితపించేవాడు కూకుట్ల బాల్‌నర్సయ్య అలియాస్ రామారెడ్డి మామ. ఆయనకు పిల్లలు లేకపోవడంతో గ్రామ ప్రజలే తన వారిగా భావించి, అందరిని ప్రేమతో పలకరించేవాడని స్థానికులు చెబుతున్నారు. మంగళవారం జరిగిన ఆయన అంత్యక్రియల్లో గ్రామ ప్రజలు భారీగా పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ ఉన్నత పాఠశాలను ఎంపీపీ రఘు ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు.

పల్లె ప్రగతి పనుల పరిశీలన

కామారెడ్డి రూరల్: రాఘవాపూర్, క్యాసంపల్లి, క్యాసంపల్లితండా గ్రామాలను మంగళవారం ఎంపీవో మలహరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు సుమేదరెడ్డి ఉన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్యవైశ్య సంఘం వాసవీ మాత అమ్మవారి దేవాలయ అభివృద్ధి కోసం మంగళవారం పలువురు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్‌కు విరాళాలు అందజేశారు. సిద్దంశెట్టి పండరి రాకేష్ గుప్తా, అల్లంప్రసాద్, గుప్తా బ్రదర్స్, బచ్చు కృష్ణమూర్తి గుప్తాలు ఒక్కొక్కరు రూ.51,118 వంతున విరాళాలు అందజేశారు.

వృద్ధులకు కుర్చీలు..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్‌లో ఆదర్శ వృద్ధుల సంఘానికి కుర్చీలను విరాళంగా కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గం ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మంగళవారం అందజేశారు. వృద్ధుల సంఘం సభ్యులు కోరిన వెంటనే 20 నాణ్యమైన కుర్చీలను ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. నాయకులు మనోహర్ రెడ్డి, భూంరావు పాల్గొన్నారు.

నియామకం

ఎల్లారెడ్డి: ఎస్సీ పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడిగా నరేష్‌ను నియమిస్తు జిల్లా అధ్యక్షులు కృష్ణ మంగళవారం నియామక పత్రం అందించినట్లు పరిరక్షణ సమితి సభ్యులు తెలిపారు. జిల్లా కేంద్రంలో నరేష్‌కు నియామక పత్రాన్ని అందించినట్లు వారు తెలిపారు.

అజ్మీర్ దర్గా వద్ద స్పీకర్ పూజలు

బాన్సువాడ టౌన్: రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్ దర్గాను మంగళవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలు సందర్శించారు. దర్గా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. స్పీకర్ వెంట డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, స్థానిక నాయకులు కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, గంగాధర్, ఏజాస్, పాత బాలకృష్ణ, బుల్లెట్‌రాజు, శ్రీధర్, గోపాల్‌రెడ్డి, బాబా తదితరులున్నారు.

బహుమతుల ప్రదానం

లింగంపేట(ఎల్లారెడ్డి): కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి లింగంపేట ఎస్సై శంకర్ బహుమతులు అందజేశారు. ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నేషనల్ యూత్‌డే పురస్కరించుకొని మంగళవారం కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించినట్లు ప్రత్యేకాధికారి వాసంతి తెలిపారు.

జీపీ ట్రాక్టర్లకు జీపీఎస్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన ట్రాక్టర్లకు మంగళవారం జీపీఎస్(గ్లోబల్ పొజిషన్ సిస్టమ్)ను ఏర్పాటు చేశారు. 25 ట్రాక్టర్లను మండల పరిషత్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చి జీపీఎస్ పరికరాన్ని అమర్చారు. గ్రామంలో ట్రాక్టర్ పని తీరును అధికారులు జీపీఎస్ ద్వారా పర్యవేక్షిస్తారని ఎంపీవో శ్రీనివాస్ తెలిపారు.

సైన్స్ ఫేర్‌లో ప్రతిభ

భిక్కనూరు: నిర్మల్ జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌లో భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన విద్యార్థి భుర్ల రిషికేష్ ప్రతిభ కనబరిచాడు. ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు సురేషు, బాబు, ఉషారాణి, పద్మలు విద్యార్థికి అభినందనలు తెలియజేశారు. స్థానిక చైతన్య విద్యానికేతన్‌లో 8వ తరగతి చదువుతున్న రిషికేష్ ఆస్టరాయిడ్ హంట్ సెర్చ్ కార్యక్రమానికి సంబంధించిన విశేషాలను వివరించారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు
- జాతీయ యువజన దినోత్సవాలలో భాగంగా క్రీడా పోటీలు ప్రారంభం



ఎల్లారెడ్డిలో కబడ్డీ ఆడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఎల్లారెడ్డి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. జాతీయ యువజన దినోత్సవాలలో భాగంగా గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన వారికి పోలీసు శాఖ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. క్రీడా పోటీలలో భాగంగా వాలీబాల్ సర్వీస్ చేసి, కబడ్డీ ఆడి ఆటలను ప్రారంభించారు.

యువకులు రాణించాలి

నిజాంసాగర్(జుక్కల్): గ్రామీణ ప్రాంత యువకులు క్రీడలపై ఆసక్తి చూపుతూ అన్నిరంగాల్లో రాణించాలని బాన్సువాడ రూరల్ సీఐ మురళి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో క్రికెట్, వాలీబాల్ క్రీడా పోటీలను డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి ప్రారంభించారు.

బిచ్కుంద(జుక్కల్): యువకులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోలీసులు ముందుకు వెళ్తున్నారని సీఐ కృష్ణ, ఎస్సై శ్రీధర్‌రెడ్డి అన్నారు. యువజన వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో పోలీసులు ఉదయం 2కే రన్‌తో పాటు క్రీడా పోటీలు నిర్వహించారు.



పెద్దకొడప్‌గల్‌లో క్రికెట్ ఆడుతున్న డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి



నిజాంసాగర్‌లో క్రీడాకారులతో సీఐ మురళి, ఎస్సై నాగగోని రాజు

ఏఎంసీ చైర్మన్ కోసం పోటీ

- నేటితో ముగిసిన పదవీ కాలం



బిచ్కుంద(జుక్కల్): మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బుధవారంతో ముగియనుంది. ప్రభుత్వం ఏఎంసీ చైర్మన్‌కు ఒక సంవత్సరం పదవీ కాలం పెట్టింది. 2021 జూలై 12న పెద్ద దేవాడకు చెందిన మల్లికార్జున్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. సంవత్సర కాలం ముగియడంతో ప్రభుత్వం మరో 6 నెలల పాటు చైర్మన్ పదవీ కాలం పొడిగించారు. నేటితో 18 నెలల పదవీ కాలం ముగియడంతో ఆ పదవి కోసం ప్రజాప్రతినిధులు పోటీ పడుతున్నారు. బిచ్కుంద మండలం మద్నూర్ ఏఎంసీ పరిధిలో ఉండేది. మద్నూర్ నుంచి బిచ్కుంద మండలం ఏఎంసీ విడదీసి కొత్తగా 2016లో వ్యవసాయ మార్కెట్ కమిటీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చైర్మన్ పదవికి పోటీ కొనసాగుతుంది. ఆశావహులు తమ పేర్లను ఎమ్మెల్యే హన్మంత్ సింధే దృష్టికి తీసుకెళ్లారు. ఫత్లాపూర్ మాజీ సర్పంచ్ నాగ్‌నాథ్ పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కనుందని సమాచారం.

సౌకర్యాలు అంతంతే..

బిచ్కుంద ఏఎంసీ కార్యాలయానికి సంవత్సర ఆదాయం రూ.1.5 కోట్లు వస్తోంది. అనుకున్నంత ఆదాయం ఉన్నా రైతులకు వసతులు కల్పించడంతో విఫలమైంది. రైతులు ధాన్యం స్టోరేజి పెట్టుకోవడానికి ఎలాంటి వసతులు కల్పించకపోవడం, వ్యాపారులతో మాట్లాడి గిట్టుబాటు ధర కోసం చైర్మన్లు, అధికారులు ఎలాంటి కృషి చేయకపోవడంతో ఈ ప్రాంత రైతులు కుసుమ, శనగ, పొద్దుతిరుగుడు, మక్క, జొన్నలు, ధనియాలు ఇతర చిరుధాన్యాలను మహారాష్ట్ర దెగ్లూర్‌లోని స్టాక్ స్టోరేజికి తరలించి అక్కడి వ్యాపారులతో మాట్లాడి అమ్ముకుంటున్నారు.

పేకాట అడ్డాగా..

బిచ్కుంద ఏఎంసీ కార్యాలయం పేకాట అడ్డాగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేకు తెలియకుండా రహస్యంగా నాన్‌లోకల్ వారితో కలిసి పేకాట, మద్యం అడ్డాగా మార్చారని చెబుతున్నారు. కార్యాలయం పక్కన ఉన్న గదులలో ప్రతి రోజు పేకాట ఆడుతున్నారు. ఇకనైనా కొత్త చైర్మన్ స్పందించి సమస్యలు పరిష్కరించి, వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

వెల్ఫేర్ బోర్డు సాధనకు ఉద్యమించాలి



బాన్సువాడలో మాట్లాడుతున్న వీరయ్య

బాన్సువాడ టౌన్: రవాణా రంగ కార్మికుల వెల్ఫేర్ బోర్డు సాధన కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీరయ్య అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్ర మంగళవారం బాన్సువాడకు చేరింది. యాత్ర బృందానికి నాయకత్వం వహిస్తున్న వీరయ్య మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థలో వెన్నుదన్నుగా ఉంటున్న రవాణా కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, కేంద్రం తీసుకువచ్చిన మోటారు రవాణా సవరణ చట్టం- 2019 మొత్తం రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజేప్పేలా ఉందని విమర్శించారు. సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, సీఐటీయు జిల్లా నాయకులు ఖలీల్, రవీందర్, అంజాద్‌ఖాన్, ముజీబ్, కృష్ణ, సాయిలు, రహీం తదితరులు ఉన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 1975 నుంచి విశ్వ హిందీభాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని ప్రిన్సిపల్ గంగాధర్ విద్యార్థులకు తెలియజేశారు. హిందీ విభాగాధిపతి గులాం ముస్తఫా, అధ్యాపకులు వెంకట్‌రావు, అంబయ్య, కృష్ణ పాల్గొన్నారు.

భిక్కనూరులో..


భిక్కనూరు: ప్రపంచంలో అత్యధికులు మాట్లాడే మూడో భాషగా హిందీ పేరు గాంచిందని హిందీ ఉపాధ్యాయుడు గఫూర్ శిక్షక్ తెలిపారు. మంగళవారం జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ భాషపై ఉపన్యాస వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, హిందీ పుస్తకాలను అందజేశారు.

రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉండాలి



కామారెడ్డి టౌన్: జిల్లాలో రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్క గౌడ కులస్తుడు ఐక్యంగా ఉండాలని జిల్లా గౌడ సంఘం ప్రతినిధులు గోపిగౌడ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంపత్ గౌడ్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా గౌడ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. గౌడల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలన్నారు. ఆయా మండలాల ప్రతినిధులు మోతే బాల్‌రాజ్‌గౌడ్, తిర్మల్‌గౌడ్, నాగభూషణం, బాలరాజ్, కౌన్సిలర్ విజయ్‌భాస్కర్‌గౌడ్, తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక



బాన్సువాడ టౌన్: రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు బాన్సువాడకు చెందిన అక్షర అనే విద్యార్థిని ఎంపికైంది. పట్టణంలోని కోనా బాన్సువాడ ఉన్నత పాఠశాలకు చెందిన అక్షర, తడి ధాన్యాన్ని ఆరబెట్టే యంత్రాన్ని తయారు చేసి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెల 9 నుంచి 11వ తేదీల్లో నిర్మల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో అక్షర తయారు చేసిన యంత్రం ప్రదర్శన ఉంటుందని గైడ్ రాఘవేందర్ తెలిపారు. ఆరబెట్టే యంత్రాన్ని తయారు చేసి వరి కోత మిషన్‌కు బిగిస్తే ధాన్యం కోసిన వెంటనే ఆరిపోతుందని, దీంతో రైతులకు లాభం చేకూరుతుందని అన్నారు. రైతులకు ఉపయోగపడే యంత్రాన్ని తయారు చేసిన అక్షరను అధికారులు, టీచర్లు అభినందించారు.

సంక్షిప్తం

ధర్నాలో పాల్గొనేందుకు అనుమతివ్వండి

భిక్కనూరు: తమకు ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యూలరైజ్ చేయాలని కోరుతూ ఈ నెల 12న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టిన ధర్నాలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలంటూ భిక్కనూరు మండల రెండో ఏఎన్ఎంలు మంగళవారం భిక్కనూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఆదర్శ్, హేలీమాలకు వినతి పత్రంలను అందజేశారు. తమకు రోజు రోజుకు పనిభారం పెరుగుతుందని కంటి వెలుగు పనిభారం తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.

క్రీడా ప్రాంగణం పనులు పూర్తి చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): క్రీడా ప్రాంగణం సకాలంలో పూర్తి చేయాలని మండల ఎంపీవో ప్రభాకరచారి సూచించారు. మంగళవారం ఆయన లింగంపేట మండలం నల్లమడుగు పెద్ద తండా గ్రామ పంచాయితీ పరిధిలో నిర్మాణం చేపడుతున్న క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు.

ఇంటి పన్ను వసూలును వేగవంతం చేయాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాలలో ఇంటిపన్నుల వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీవో శ్రీనివాస్ సూచించారు.మెల్లకుంటతండాలో చేపట్టిన పన్నుల వసూలు ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు.

మొక్కలు బాగా పెరిగేలా చర్యలు తీసుకోండి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నర్సరీలలో మొక్కలు బాగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని నర్సరీ నిర్వాహకులు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి సూచించారు. మంగళవారం బ్రాహ్మణపల్లి, మత్తమాల, జంగమాయిపల్లి, అల్మాజీపూర్, రుద్రారం గ్రామాలలోని నర్సరీలను ఆయన పరిశీలించారు.

ముగ్గుల పోటీలు

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. జాగృతి యువజన విభాగం జిల్లా కన్వీనర్ శ్రీరాం వెంకటేష్, ఎంపీటీసీ సభ్యుడు సాయగౌడ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా పంటల నమోదు

భిక్కనూరు: రైతులు తమ పంట పొలాల్లో సాగుచేస్తున్న పంటల సాగు వివరాల నమోదును పకడ్బందీగా నమోదు చేయాలని భిక్కనూరు మండల వ్యవసాయాధికారిణి రాధ సూచించారు. మంగళవారం ఆమె ఇసన్నపల్లిలోని పంట పొలాలను పరిశీలించారు.

డిగ్రీ కళాశాల భూముల జోలికి రావద్దు

కామారెడ్డి టౌన్: నూతన మాస్టర్‌ప్లాన్‌లోకి కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములను తీసుకోవద్దని ఏబీవీపీ నేతలు కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కళాశాల భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. నాయకులు చరణ్, రాజు, సాత్విక్, రాజశేఖర్‌లు ఉన్నారు.

విలువైన వస్తువులను ఇంట్లో పెట్టొద్దు

ఎల్లారెడ్డి: సంక్రాంతి పండగకు ఊర్లో వారు విలువైన వస్తువులను ఇంటిలో ఉంచవద్దని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఊరికి వెళ్లే వారు వారి వారి పరిసర ప్రాంతాల పోలీస్ స్టేషన్‌లలో సమాచారం అందించాలని అన్నారు. సమాచారం అందించిన వారి కాలనీలలో పెట్రోలింగ్ చేయిస్తామన్నారు. అలాగే సంక్రాంతి పండగను పురస్కరించుకుని గాలి పటాలను విక్రయించే విక్రయదారులు చైనా మాంజాను విక్రయించరాదని సూచించారు. చైనా మాంజా విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

బూస్టర్ డోస్ తీసుకోండి

ఎల్లారెడ్డి: 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు కోవిడ్ బూస్టర్ డోస్‌ను తీసుకోవాలని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రవీంద్రమోహన్ మంగళవారం తెలిపారు. రెండు డోసులు కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న వారు బూస్టర్ డోస్ తీసుకోవాలని అన్నారు.

వ్యవసాయంలో మెలకువలు పాటించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): వ్యవసాయం చేసే రైతులు పంటలు పండిచేటప్పుడు మెలకువలు పాటించాలని వ్యవసాయ సహాయ సంచాలకురాలు రత్న అన్నారు. బ్రాహ్మణపల్లిలో మంగళవారం యాసంగి పంటలపై అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో మొక్కజొన్న, వరి, చెరకు పంటలను పరిశీలించారు. యాసంగిలో వరి పంటలో తీసుకోవల్సిన యాజమాన్యపద్ధతులపై అవగాహన కల్పించారు.

పంట పొలాల మీదుగా రోడ్డు వేయొద్దు



వినతిపత్రం అందజేస్తున్న 6వ వార్డు ప్రతినిధులు

కామారెడ్డి టౌన్: మాస్టర్ ప్లాన్‌లో తమ పంట పొలాల మీదుగా రోడ్డు వేయవద్దని 6వ వార్డు సరంపల్లికి చెందిన రైతులు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పుష్కలంగా పంటలు పండే భూముల్లో అవసరం లేకున్నా రోడ్డుకు ప్రతిపాదనలు పెట్టడం దారుణమన్నారు. కౌన్సిలర్ భర్త రవికుమార్, రైతులు అంజన్‌కుమార్, శ్రీనివాస్, బాలనర్సింలు, తదితరులున్నారు.

40 ఫీట్లకు తగ్గించాలి

కామారెడ్డి టౌన్: పట్టణంలోని ఆర్కే లాడ్జి నుంచి జన్మభూమి రోడ్డు వరకు 40 ఫీట్లకు రోడ్డును తగ్గించాలని కోరుతూ స్థానికులు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనుమతితో నిర్మించుకున్న గృహాలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

స్వయం ఉపాధి పొందాలి

బీబీపేట: మహిళలు అన్ని రంగాలలో ముందుడటంతో పాటు స్వయం ఉపాధి పొందాలని సుభిషి ఇన్‌ఫ్రా తిమ్మయ్యగారి వాణి అన్నారు. మంగళవారం ఆమె సొంత గ్రామమైన జనగామలో మహిళలకు స్వయం ఉపాధిపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఆసక్తి ఉన్న మహిళలకు సుభిషి ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో హామ్నెక్ కాలేజ్ ఫర్ క్రియేటివ్ ఎడ్యుకేషన్ విద్యార్థులతో కలిసి టైలరింగ్, బ్యూటీ పార్లర్, మగ్గం వర్క్ తదితర పనులపై శిక్షణ ఇస్తామన్నారు. సర్పంచ్ పాత రాజు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

దోమకొండ: అంగన్‌వాడీ పాఠశాలల్లో టీచర్లు, ఆయాలు సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సీడీపీవో రోశమ్మ అన్నారు. మంగళవారం దోమకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని దోమకొండ, భిక్కనూరు, మాచారెడ్డి, బీబీపేట, రాజంపేట మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి పాఠశాలలో గ్రోత్ మానిటరింగ్, కిచెన్ గార్డెన్, ఏఎల్ఎంఎస్‌సీ తీర్మానాలు, ప్రిస్కూల్, ఆక్టివిటీస్, తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

తడి పొడి విధానంపై అవగాహన

భిక్కనూరు: ఇసన్నపల్లిలో రైతులకు వరిలో తడి, పొడి విధానం గురించి కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్స్, పద్మపాని సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ విధానంలో భాగంగా నీరు పెట్టడం ఆర బెట్టడం ద్వారా నీటి వినియోగం తగ్గడంతో పాటు నీటి సామర్థ్యం పెరుగుతుందని రైతులకు వివరించారు. అంతేకాకుండా కాలుష్య కారకమైన మీథేన్ వాయువు విడుదల కూడా ఈ పద్ధతిలో తగ్గుతుందని అన్నారు. పద్మపాని సంస్థ మండల కో-ఆర్డినేటర్ రవికుమార్, సర్పంచ్ గుడిసె రాములు, వైస్ ఎంపీపీ గుడిసె యాదగిరి, ఏఈవో ఆనంద్‌లు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు కారోబార్ల వినతి

బాన్సువాడ టౌన్: కారోబర్లకు సహాయ పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించాలని కోరుతూ నస్రుల్లాబాద్ మండలానికి వచ్చిన పంచాయతీ రాజ్ కమిషనర్ హన్మంత్‌రావుకు మంగళవారం కారోబార్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కారోబర్ల సంఘం జిల్లా అధ్యక్షులు దుర్గాగౌడ్ మాట్లాడుతూ గ్రామ పంచాయితీల్లో ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న కారోబర్లకు మల్టిపర్పస్ విధానం నుంచి తప్పించి సహాయ కార్యదర్శిలుగా పదోన్నతులు కల్పించాలని విన్నవించారు.

సమస్యల పరిష్కారంలో టీఎన్‌జీవో ముందంజ

- టీఎన్‌జీవో తాలూకా కార్యవర్గం ఏర్పాటు

దోమకొండ: ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎన్‌జీవో ముందంజలో ఉంటుందని సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో దోమకొండ తాలూకా టీఎన్‌జీవో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులందరూ ఐక్యమత్యంతో ఉండి సమస్యలపై పోరాటం చేయాలన్నారు. అధ్యక్షుడిగా భూపాల్ సంతోష్‌కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి, కార్యదర్శిగా శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సాయిలు, అజయ్‌కుమార్, శ్వేత, మహిళా ఉపాధ్యక్షురాలిగా సునీత, సంయుక్త కార్యదర్శిగా సురేష్, ప్రకాష్, ప్రియాంక, శ్రీలత, తదితరులను ఎన్నుకున్నారు.

గడప గడపకు రాహుల్ సందేశం చేరాలి



మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి

ఎల్లారెడ్డి: గడప గడపకు రాహుల్ గాంధీ సందేశం చేరేలా కార్యకర్తలు పని చేయాలని టీపీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో హాత్ సే హాత్ జోడో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. భారత్ జోడో యాత్రకు మద్దతుగా రాష్ట్రంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ నెల 26 నుంచి హాత్ సే హాత్ జోడో యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. దీనిని ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సైతం విజయవంతం అయ్యేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ మోహన్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాగయ్య, తదితరులు ఉన్నారు.

సమాచారం..

2కే రన్ రేపటికి వాయిదా

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలో బుధవారం నిర్వహించే 2కే రన్‌ను గురువారానికి వాయిదా వేసినట్లు ఎస్సై గణేష్ మంగళవారం తెలిపారు. అనివార్య కారణాల వల్ల 2కే రన్‌ను గురువారం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

రేపు రక్తదాన శిబిరం

కామారెడ్డి అర్బన్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గురువారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కామారెడ్డి ఏరియా ఆసుపత్రిలో రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్, వాసవీక్లబ్, ఇండియన్ రెడ్‌క్రాస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఐవీఎఫ్ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బాలు తెలిపారు.

బాన్సువాడలో కబడ్డీ పోటీలు

బాన్సువాడ టౌన్: బాన్సువాడలో గురువారం కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నరేష్, ప్రవీణ్‌లు తెలిపారు. స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. వివరాలకు 9440095566, 7396585818లను సంప్రదించాలని సూచించారు.

నేడు తాడ్వాయికి ఎమ్మెల్యే రాక

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి బుధవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ విచ్చేయనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి తెలిపారు. తాడ్వాయి ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తారన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేస్తారని వివరించారు.

'మోడల్'లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సాయిబాబా మంగళవారం తెలిపారు. 6వ తరగతిలో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో ఈ నెల 10 నుంచి ఫిబ్రవరి 15లోగా, 7 నుంచి 10వ తరగతిలో మిగిలిన సీట్లకు సైతం దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అర్హత పరీక్ష ఏప్రిల్ 16న ఉంటుందన్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాలలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లి(ఖుర్దు) గ్రామంలో కొనసాగుతున్న మైనార్టీ గురుకుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ వెంకట్రాములు తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో, అలాగే 6, 7, 8 తరగతుల్లో పరిమిత సంఖ్యలో మిగిలి ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

మాచారెడ్డి: మైనారిటీ కార్పొరేషన్ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మాచారెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రమోద్ మంగళవారం తెలిపారు.

పార్టీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: దోమకొండ, బీబీపేట మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమేశనం జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని సంక్షేమం తెలంగాణలో జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి క్షేత్ర స్థాయిలో పార్టీని మరింతగా బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. జడ్పీ వైస్‌చైర్మెన్ ప్రేమ్‌కుమార్, పాల్గొన్నారు.